సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 21 । జనవరి । 2024



ఇంజీనియస్‌గా..

- రెండో రోజు కొనసాగిన టెక్నోజియాన్‌–24
- అబ్బురపరిచిన ప్రదర్శనలు
- ప్రత్యేక ఆకర్షణగా నిట్ రోబోటిక్ క్లబ్
- నేటితో సాంకేతిక మహోత్సవం ముగింపు

- వివరాలు 8లో ▸

వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్‌–24 రెండో రోజు ఉత్సాహంగా సాగింది. ఇంజీనియస్ థీమ్‌కు తగినట్లు ఇంజనీర్లు శనివారం వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించారు. వరంగల్ విద్యార్థుల రోబోటిక్ క్లబ్ ప్రదర్శనలు, ఆల్ టెరేన్ ఫోర్ వీలర్, 3డీ ప్రింటింగ్, హర్డ్ మానియా, పింగ్ పాంగ్ లాంచర్, డ్రోన్‌ల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు వచ్చి ప్రదర్శనలను తిలకించారు. వాటి పని విధానం, ప్రత్యేకతలను యువ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సాంకేతిక మహోత్సవం ఆదివారంతో ముగుస్తుంది.

- కాజీపేట అర్బన్

న్యూస్‌రీల్

కాజీపేటనుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు



మొత్తం 15 సర్వీస్‌లు అందుబాటులో..

- వివరాలు 8లో ▸

ప్రత్యేక స్థలంలో 'దక్కన్ క్వీన్ స్టీమ్‌లోకో'



కాజీపేట రూరల్ : రైల్వే చరిత్రకు గుర్తుగా తొలితరం దక్కన్ క్వీన్ స్టీమ్ లోకోను 2007లో కాజీపేట జంక్షన్ ఎదుట ఏర్పాటు చేశారు. జంక్షన్ అభివృద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ ఎదుట ఉన్న స్టీమ్ లోకోను ప్రత్యేక స్థలంలో నెలకొల్పేందుకు మోడల్ సర్కిల్ స్టీమ్ లోకో జోన్‌ను స్టేషన్ ఎదుట నిర్మించారు. కాగా, శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంజనీరింగ్, మెకానికల్ రైల్వే అధికారులు, సిబ్బంది శ్రమించి క్రేన్‌ల సహాయంతో ప్రత్యేక స్థలంలో లోకోను ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్టేషన్ ఎదుట పలు చోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఏడీఎంఈ ఎం. భానుప్రకాష్, ఏడీఈఎన్ ఎం.ఆర్.కె.రాజు పర్యవేక్షణలో యాక్సిడెంట్ రిలీఫ్ ట్రెయిన్(ఎఆర్‌టీ) ఎస్ఎస్ఈ పి.చంద్రశేఖర్, ఐఓడబ్ల్యూ విజయ్‌కుమార్, పీడబ్ల్యూఐ రజనీకాంత్, జేఈ సీహెచ్.మణికంఠ, సూపర్‌వైజర్లు, 16మంది ఎఆర్‌టీ టెక్నీషియన్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా స్టీమ్‌లోకోను తరలిస్తుండగా స్థానికులతో పాటు ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

సకలగుణ సంపన్నుడు.. శ్రీరాముడు



హన్మకొండ కల్చరల్ : ధనుర్విద్యలోనే కాదు.. అన్ని శాస్త్రాలు నేర్చిన సకలగుణ సంపన్నుడు శ్రీరాముడని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎస్.అనంతలక్ష్మి అన్నారు. శనివారం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ వెంకటయ్య ఆమెకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ నాట్యమండపంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఉద్యమ సంబంధం కలిగిన అయోధ్య క్షేత్రం ధర్మప్రచారానికి ఒక వేదిక కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేడీ లక్ష్మీనారాయణ, కవితారెడ్డి, సుధీర, వేదపండితులు మణికంఠ శర్మ, పరిచారకుడు సందీప్‌శర్మ పాల్గొన్నారు.

తెరుచుకోని వరంగల్ రైల్వే క్యాంటిన్



కాశిబుగ్గ : వరంగల్ రైల్వే స్టేషన్‌లోని క్యాంటిన్ మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టేషన్ మీదుగా నిత్యం పదుల సంఖ్యలో ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు తిరుగుతుంటాయి. అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో స్టేషన్‌లో క్యాంటిన్ అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తినేందుకు బయటికి వెళ్తున్నారు. ఈలోగా రైళ్లు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి క్యాంటిన్ తెరవాలని కోరుతున్నారు.

'108' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

హన్మకొండ అర్బన్ : రాష్ట్రంలోని 108 వాహనం అత్యవసర సేవల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, లేదా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ బాలాజీ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రెగ్యులరైజ్ చేయడానికి ఇబ్బందులు ఉంటే 2020 పీఆర్‌సీ ప్రకారం ఈఎంటీలకు ఎంపీహెచ్ఏల వేతనం, పైలట్లకు ప్రభుత్వ డ్రైవర్ల వేతనం అందజేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రాలు అందజేశారు.

రెడ్‌క్రాస్‌కు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు



రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కు అత్యున్నత 'ఎన్ఏబీహెచ్' గుర్తింపు లభించిందని రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. శనివారం రెడ్‌క్రాస్‌లో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్(ఎన్ఏబీహెచ్), హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌కు సంబంధించి సర్టిఫికెట్ గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు. రక్త సేకరణ, నిల్వలు, పరీక్షల్లో ఎన్ఏబీహెచ్ సూచించిన నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్లే గుర్తింపు వచ్చిందన్నారు. ఈ గుర్తింపు 2026ఆఖరు వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, రాష్ట్ర పాలకమండలి సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, సభ్యులు పుల్లూరు వేణు, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, సీహెచ్ సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిల్లా రమణారెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఓరుగల్లు ఆదర్శం కావాలి!



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా శాఖల అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, విప్ రాంచంద్రునాయక్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల సమస్యలు తీరాలె
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- సుమారు ఐదున్నర గంటలు సాగిన ఉమ్మడి జిల్లా సమీక్ష... 11 శాఖలపై సుదీర్ఘంగా చర్చ
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, ఎస్పీలు, జిల్లా ఉన్నతాధికారులు



సాక్షిప్రతినిధి, వరంగల్:

అభివృద్ధి, సంక్షేమంలో ఉమ్మడి వరంగల్ తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేద్దామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, అవసరమైన నిధులు కేటాయిస్తోందన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలు, ప్రజాపాలన లక్ష్యంగా ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల సమస్యలు తీరేలా శ్రమిద్దామన్నారు. అభివృద్ధి పనుల్లో అక్రమాలు, అవినీతి లేకుండా చూడాలని, నాణ్యత లోపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా (హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి) పరిధిలోని 12 నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, కుడా, జీడబ్ల్యూఎంసీ, నేషనల్ హైవేస్, ఐటీడీఏ, హౌసింగ్, పోలీస్, ఫారెస్ట్, దేవాదాయ శాఖల పనితీరు, చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. వివిధ అంశాలను అధికారులు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకువచ్చారు. సమీక్ష సమావేశం ముగిసిన అనంతరంమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలు మీడియాకు వివరాలు వెల్లడించారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, శివలింగయ్య, ఇలా త్రిపాఠి, భవేష్ మిశ్రా, అద్వైత్ కుమార్ సింగ్, బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, ఎస్పీలు శబరీష్, డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జి పాటిల్, కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంలో ఏ లోటూ రావొద్దు

ప్రజాప్రభుత్వంలో ప్రజలకు ఏ లోటూ రాకుండా కలెక్టర్లు, అధికారులు చూడాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. వచ్చేది వేసవికాలం కాబట్టి ఎక్కడ కూడా తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఏ స్టేజిలో ఉన్నా పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. వచ్చే నెలలో మేడారం జాతర ఉన్న నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన మేడారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు అద్భుత పనితీరు కనబరిచారని, ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు. పంటల సాగుకు సాగునీరు అందించకపోతే ఇబ్బందులు వస్తాయని, కాబట్టి ఆ శాఖ అధికారులు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, గురుకులాలను తరచూ జిల్లా కలెక్టర్లు, అధికారులు తనిఖీ చేయాలన్నారు. తాను కూడా ఎక్కడో చోట ఆకస్మికంగా తనిఖీ చేస్తానని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొండా సురేఖ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి



ప్రజల అభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం. మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం. గతంలో కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి కోసం డీఆర్సీ, డీఆర్డీఓ సమావేశాలు జరిగేవి. గత ప్రభుత్వం సమావేశాలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధిలో రాష్ట్రం వెనకబడి పోయి ప్రజలకు నష్టం జరిగింది. ప్రజలకు అన్నీ సౌకర్యాలు అందడం కోసమే ఇలాంటి సమీక్ష సమావేశాలు. నాలాల ఆక్రమణపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాలి.

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం

పొన్నం ప్రభాకర్, రవాణాశాఖ మంత్రి



తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటైంది. ఈ ప్రభుత్వం హయాంలో ఆరు గ్యారంటీల అమలుతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్నాం. ఉమ్మడి కరీంనగర్ పరిధిలో ఉన్న మూడు మండలాలు హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చాయి. వాటి అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలి.

బడ్జెట్‌లో నిధుల కేటాయింపులకు సమీక్ష ఉపయోగం

ధనసరి సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి



ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు సమీక్షా సమావేశం ఉపయోగపడుతుంది. మేడారం జాతరకు మరిన్ని ఆర్టీసీ బస్సులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరుతున్నా. 25, 28వ తేదీల్లోనూ మేడారం జాతరను సందర్శించాలి. జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతంతో పాటు చిన్నచిన్న వాగులు, పెద్ద పెద్ద చెరువులు చాలా ఉన్నాయి. రామప్ప, లక్నవరం సరస్సులను అనుసంధానం చేయడం కోసం శాశ్వత గ్రావిటీ కాల్వల నిర్మాణం కోసం భూసేకరణ జరిగింది. పెండింగ్ ఉన్న ల్యాండ్ అక్విజిషన్‌కు కూడా డబ్బులు అందించాలి.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

నగరంలో చాలా చోట్ల నాలాలు, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవడంతో వర్షాకాలంలో వరదలు నగరాన్ని ముంచెత్తుతున్నాయి. వాటిపై చర్యలు తీసుకొని ముంపుబారినుంచి కాపాడాలి.

- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ

గ్రేటర్ వరంగల్ విలీన గ్రామాల్లో అనుకున్నంత అభివృద్ధి జరగలేదు. గతంలో ఉన్నట్లుగానే తమ గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఉంచాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట

ల్యాండ్ పూలింగ్ పేరుతో గత ప్రభుత్వం తెచ్చిన జీఓను రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఆ జీఓ ఇంకా రద్దు కాలేదని అభిప్రాయం ఉంది. స్పష్టత ఇచ్చి రైతులకు ఉన్న అపోహలను అధికారులు తొలగించాలి.

- రేవూరి ప్రకాష్‌రెడ్డి, పరకాల

'కాళోజీ' పనులు వేగంగా పూర్తిచేయండి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కాళోజీ కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

హన్మకొండ కల్చరల్/వరంగల్ చౌరస్తా : కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు సందర్శించారు. కళాక్షేత్రంలో నిర్మిస్తున్న ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, కళాక్షేత్రం మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం వరంగల్ 27వ డివిజన్‌లోని రాంకీ బిల్డర్స్ హౌసింగ్‌బోర్డుకు కేటాయించిన ఫ్లాట్స్‌ను మంత్రులు పరిశీలించారు. 102 గృహ నిర్మాణాలను పర్యవేక్షించారు. అంతకుముందు రాంపూర్ శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సర్కిల్ వద్ద వరంగల్‌కు వచ్చే రోడ్ మార్గం రూట్ మ్యాపును పరిశీలించారు. సమగ్ర వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి నేషనల్ హైవే అథారిటీ, కుడా అధికారులను ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ : హనుమకొండ, కాజీపేట, వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాజీపేటలోని ప్రశాంత్‌నగర్, చైతన్యపురి కాలనీ, హనుమకొండలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్, రాంనగర్, జవహర్ కాలనీ, నందితారే నగర్, నందిహిల్స్, దీన్‌దయాళ్ నగర్, శ్రీరామ కాలనీ, రామారావు కాలనీ, హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, హనుమకొండ జిల్లా బస్ స్టేషన్, టైలర్స్ స్ట్రీట్, పెద్దమ్మగడ్డ, రంగంపేట, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ, గార్డియన్ ఆస్పత్రి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

వరంగల్ పరిధిలో..

అదేవిధంగా వరంగల్ గ్రెయిన్ మార్కెట్, స్టేషన్ రోడ్, పోచమ్మ మైదాన్ సర్కిల్, కొత్తవాడ, డాక్టర్స్ కాలనీ, పైడిపల్లి, మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్, జన్మభూమి జంక్షన్, ఆంధ్రాబ్యాంకు, శంభునిపేట, ఉర్సు, పాపయ్యపేట చమన్, మజీద్ రోడ్, జెమిని థియేటర్, ఎల్లం బజార్, జ్యోతి కాలనీ, గణేశ్ కాలనీ, పోతన సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఓటరు నమోదుకు అవకాశం

వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి : స్పెషల్ క్యాంపెయినింగ్‌లో అర్హత కలిగిన వారు నూతన ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా శనివారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని హనుమకొండ మండలం గోపాలపురం జవహర్‌కాలనీ పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వాకాడేతో కలిసి ప్రావీణ్య సందర్శించారు. ఓటరు నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. బూత్ లెవల్ అధికారుల పనితీరును పర్యవేక్షించారు. ఫారం– 6, 7, 8 జనరేట్, అప్‌డేట్, బీఎల్‌ఓల ఇంటింటి సర్వే రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పటిష్టమైన ఓటరు జాబితా తయారీకి కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 791 కేంద్రాల్లో రెండు రోజుల పాటు(శని, ఆదివారాల్లో) ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఈసందర్భంగా బీఎల్‌ఓ యాప్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

సేంద్రియ వ్యవసాయంతో సుస్థిర అభివృద్ధి

- బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్
- ముగిసిన రాష్ట్రస్థాయి మహాసభలు



సభలో మాట్లాడుతున్న బాలథెరిసా జింగ్రాస్

కాజీపేట రూరల్ : సేంద్రియ వ్యవసాయంతోనే రైతులు సుస్థిర అభివృద్ధి సాధిస్తారని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ప్రాంగణంలో శనివారం 'సేంద్రియ రైతు మహాసభ–సుస్థిర వ్యవసాయం–సమీకృత అభివృద్ధి' ముగింపు మహాసభ నిర్వహించారు. ఈ సభలో బాలథెరిసా మాట్లాడుతూ.. బాలవికాస 15 ఏళ్ల క్రితం ముగ్గురు రైతులతో సేంద్రియ వ్యవసాయం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు 1,500 మంది దాకా చేరడమనేది ఒక రైతుబిడ్డగా గర్వంగా ఉందన్నారు. ఈ సేంద్రియ వ్యవసాయం భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. విదేశాల్లో కూడా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రైతుఇంట గోశాల ఉండాలని, దేశీయ పోషణ చేయాలని, రైతు సంఘాలతో ఎఫ్‌పీఓను ఏర్పాటు చేసి ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ..సేంద్రియ రైతుల పండించిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరత్నం నాయుడు, కృష్ణారెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు రాజమౌళి, సోపార్ కెనడా డైరెక్టర్ శోభ, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, సేంద్రియ వ్యవసాయ ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, లత, ప్రతాప్‌రెడ్డి, ఫ్రాన్సిస్‌రెడ్డి, శివరాం, బాలవికాస సిబ్బంది పాల్గొన్నారు.

'పశుసంపద చూస్తుంటే బాల్యం గుర్తుకొస్తోంది'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

హసన్‌పర్తి : ఇక్కడి పశుసంపదను చూస్తుంటే బాల్యదశలో ఇంటి వద్ద పాలేరుగా చేసిన పాత రోజులు గుర్తుకొస్తున్నాయని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. శనివారం చింతగట్టులోని మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎన్ ఫౌండేషన్ సహకారంతో ఔషధ మొక్కల పంపిణీ 'ఒక్క రోజు శిక్షణ–వందేళ్ల రక్షణ' అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఉమారెడ్డి మాట్లాడారు. ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలు పెంచాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు చేయాలన్నారు. సమావేశానికి హాజరైన అతిథులు వివిధ వ్యాధులకు సంబంధించిన పారంపర్య వైద్యంపై అవగాహన కల్పించారు. 108 ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై రైతులకు వివరించి, ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. గోశాల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.రమేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, డీఎఫ్‌ఓ సుజాత, జమాల్ ఖాన్, బాలనర్సయ్య, సుధాకర్‌తో పాటు 250మంది వైద్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'నవోదయ' పరీక్ష



మట్టెవాడ ప్రభుత్వ పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ

మామునూరు: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 26 కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,638 మంది విద్యార్థులకుగాను 4,033 మంది పరీక్షకు హాజరయ్యారు. 72 శాతం విద్యార్థులు హాజరైనట్లు పర్యవేక్షకులు, నవోదయ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణిమ తెలిపారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించిన పరీక్ష సజావుగా సాగిందని చెప్పారు. 80 సీట్లకు 4,033 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు. కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

కాజీపేట నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా నుంచి అయోధ్యకు తరలివెళ్లే భక్తుల సౌకార్యర్థం కాజీపేట నుంచి, కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం రాత్రి ప్రకటించారు. జనవరి 30వ తేదీ నుంచి కాజీపేట–అయోధ్య ప్రత్యేక రైలు నడిపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కాజీపేట–అయోధ్య (07223) ప్రత్యేక రైలు జనవరి 30, ఫిబ్రవరి 1,3,6,8,10,12,14,16,18,20,22,24,26,28వ తేదీల్లో కాజీపేట నుంచి 18. 20 గంటలకు బయలుదేరి అయోధ్యకు వెళ్తుంది. అదేవిధంగా అయోధ్య–కాజీపేట (07224) ప్రత్యేక రైలు ఫిబ్రవరి 2, 4,6,8,9,11,13,15,17,19,21,23,25,27,29, మార్చి 2వ తేదీల్లో అయోధ్యలో బయలుదేరి 21.00 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది.

కాజీపేట మీదుగా అయోధ్యకు ప్రత్యేక రైలు

కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–అయోధ్యకు 16 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్–అయోధ్య (07221) 16 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను జనవరి 29, 31, మార్చి 2,5,7,9,11,13,15,17,19,21,23, 25, 27,29 తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు 18.20 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా అయోధ్య–సికింద్రాబాద్ (07222) ప్రత్యేక రైలు జనవరి 1,3,5,8, 1012,14,16,18,20,22,24,26,28, మార్చి 1, 3వ తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు 20.08 గంటలకు చేరుకుంటుంది.

టికెట్ కౌంటర్లు తెరిచారు

సాక్షి ఎఫెక్ట్..

కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో సాధారణ టికెట్ కౌంటర్లను అధికారులు ఎట్టకేలకు తెరిచారు. 'మూడు కౌంటర్ల మూసివేత' టికెట్ల కోసం ఇక్కట్లు అంటూ 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. ఉదయం మొదటి ప్లాట్‌ఫాంలో శుక్రవారం వరకు మూసివేసిన మూడు కౌంటర్లు తెరిచి ప్రయాణికులకు టికెట్లు జారీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులు టికెట్ కౌంటర్లలో టికెట్లు ఇస్తూ యూటీఎస్ యాప్‌ను ప్రమోట్ చేసుకోవాలని కోరారు.

ఇం'జీనియస్'గా..

అద్వితీయంగా టెక్నోజియాన్–24 | **రెండో రోజు అబ్బురపరిచిన ప్రదర్శనలు**


ప్రదర్శనకు హాజరవుతున్న పాఠశాలల విద్యార్థులు

- ప్రత్యేక ఆకర్షణగా నిట్ రోబోటిక్ క్లబ్
- నేటితో ముగియనున్న సాంకేతిక మహోత్సవం

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న సాంకేతిక మహోత్సవం టెక్నోజియాన్–24.. యువ ఇంజనీర్ల ఆవిష్కరణల ప్రదర్శనలతో థీమ్‌కు తగ్గట్టు జీనియస్‌గా నిలిచింది. మూడు రోజుల టెక్నోత్సవంలోని రెండో రోజు శనివారం స్పాట్‌లైట్స్‌లో భాగంగా నిట్ వరంగల్ విద్యార్థుల రోబోటిక్ క్లబ్ ప్రదర్శనలు, మెకానికల్ విభాగం ఆల్ టెరేన్ ఫోర్ వీలర్, 3డీ ప్రింటింగ్, హార్డ్ మానీయా, పింగ్ పాంగ్ లాంఛర్, డ్రోన్ల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేటితో ముగియనున్న టెక్నోజియాన్..

టెక్నోజియాన్–24 ఇంజీనియస్ ఆదివారం మూడో రోజుతో ముగియనుంది. చివరి రోజు ముగింపు సందర్భంగా స్పాట్‌లైట్స్‌లో భాగంగా వీఆర్ క్రికెట్, ఏస్కేప్ రూమ్, జాహాజ్, హోవర్‌మానీయా, క్యాప్చర్ ద రింగ్, ఆర్సీ బగ్గీ, ఆస్ట్రానమీ డిబెట్, వరంగల్ ట్రేడింగ్ రింగ్‌లతో ముగియనుంది.

వైర్‌ను కాల్చు .. 3డీ ప్రింటింగ్ రాబట్టు..



వైర్‌ను కాల్చు.. 3డీ ప్రింటింగ్‌లో బొమ్మను రాబట్టు అంటూ మహారాష్ట్రకు చెందిన ప్రత్యూష్.. టెక్నోజియాన్–24లో 3డీ ప్రింటింగ్‌ను ఏర్పాటు చేశారు. గ్రాఫిక్స్ సాయంతో కంప్యూటర్‌లో బొమ్మను గీసిన అనంతరం 3డీ ప్రింటింగ్ నిమిత్తం రూపొందించిన ఏబీ, పీఎల్‌వీ వైర్లను కొద్దిపాటి ఉష్ణోగ్రతతో కాల్చడం ద్వారా కోరుకున్న 3డీ ప్రింటింగ్ అందుతుంది.

ప్రదర్శించింది : ప్రత్యూష్ , మహారాష్ట్ర



కొండలు, గుట్టలు ఎక్కేస్తా.. ఆల్‌టరేన్ వెహికిల్

రేసింగ్ నిమిత్తం నిట్ వరంగల్‌లోని మెకానికల్ విభాగానికి చెందిన 25 మంది టీంగా ఏర్పడి 6 నెలలు శ్రమించి ఫోర్ వీలర్ ఆల్ టరేన్, సింగిల్ డ్రైవర్ సిట్టింగ్ కారును రూపొందించారు. 5 లీటర్ల పెట్రోల్ ట్యాంక్‌తో 45 కిలోమీటర్ల మైలేజ్‌తో ఆల్ టరేన్‌ను సుమారు రూ. 10లక్షలతో రూపొందించారు. ఆల్‌టరేన్‌లోని ప్రతి టైర్‌కు పవర్ సరఫరా అయ్యేలా తయారు చేశారు. దీంతో కొండలు, గుట్టలు సునాయాసంగా చేరుకుంటుంది. ఈ ప్రదర్శన ఇటీవల ఇండోర్‌లోని ఐతాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నాట్రాక్స్ నేషనల్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది.

ప్రదర్శించింది : మనోజ్ , మెకానికల్, నిట్ వరంగల్ స్పార్క్ టీం



సెల్‌ఫోన్ టార్చ్ లైట్‌తో కార్ డ్రైవింగ్..



సెల్‌ఫోన్ టార్చ్ లైట్‌ను రీమోట్ కంట్రోల్‌గా మలచుకుని కారు డ్రైవింగ్ చేసేందుకు ప్రత్యేక రోబో కారును రూపొందించారు నిట్ వరంగల్‌కు చెందిన భరత్.. సెల్ ఫోన్ టార్చ్ లైట్ వెలుతురును కారులో ఏర్పాటు చేసిన సెన్సార్‌లు స్వీకరించి కారు ప్రయాణిస్తుంది. సోలార్ ఎనర్జీ మాదిరి రాబోవు రోజుల్లో సెల్‌ఫోన్ లైట్స్‌తో ఎనర్జీని ఆవిష్కరించొచ్చు.

ప్రదర్శించింది : భరత్, నిట్ వరంగల్

అడ్డంకులు దాటి గమ్యాన్ని చేరు..



రీమోట్ కారును వైఫై సాయంతో మొబైల్ మానిటరింగ్ చేస్తూ.. ఏమైనా అడ్డంకులు ఎదురైతే వాటిని అధిగమించి గమ్యం చేరేందుకు హార్డిల్ మానీయా సెన్సార్ రోబో తోడ్పడుతుంది. ఏర్పాటు చేసిన దారిలో ప్రయాణిస్తూ లక్ష్యాన్ని చేరడంలో మొబైల్ కంట్రోలింగ్ ద్వారా ప్రత్యేక సెన్సార్లను ఏర్పాటు చేశారు.

ప్రదర్శించింది : మెహతాసీన్, నిట్ వరంగల్


ప్రదర్శనకు హాజరవుతున్న కళాశాలల విద్యార్థులు

ప్రత్యేక ఆకర్షణగా టీజెడ్ రేస్..

నిట్ వరంగల్‌లోని రోబోటిక్ క్లబ్ టీం రూపొందించిన టీజెడ్(టెక్నోజియాన్–24) రూట్‌లో రోబో కార్స్ రేసింగ్ పోటీ.. టెక్నోజియాన్–24లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



అవాంతరాలను ఎదుర్కొంటేనే అద్భుతాలు..



అవాంతరాలు ఎదుర్కొంటేనే జీవితంలో అద్భుతాలు చూస్తాం. తొలుత బస్ మోడల్‌లో ఏర్పాటు చేసిన రెడ్ బస్ రెస్టారెంట్ ప్రజలకు దగ్గరవుతుందా అని సందేహించాం. కానీ వినూత్న ఆలోచనతో రెడ్ బస్ రెస్టారెంట్ పేరుతోనే ప్రజలకు చేరువయ్యాం. వినూత్న ఆలోచనలను ఆవిష్కరించడం ద్వారా స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి కల్పించొచ్చని రెడ్ బస్ రెస్టారెంట్ రుజువు చేసింది. నిట్ వరంగల్‌లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి తమ ఆలోచనలకు ఆవిష్కరణ రూపం కల్పించాలి.

ప్రకాష్ సంగం, సీఈవో, రెడ్ బస్

పంచ్ కొట్టు.. పవర్ పట్టు



పంచ్ కొట్టు.. పవర్ పట్టు అంటూ సుత్తితో సెన్సార్ బోర్డుపై బలంగా కొట్టడం ద్వారా చేయి ఆర్మ్ పవర్‌ను ఆవిష్కరించడంతో పాటు పంచ్ పవర్‌ను ఎనర్జీగా ఆవిష్కరించేందుకు తోడ్పడుతుంది. వివిధ అవసరాల నిమిత్తం పంచ్ పవర్ ఎనర్జీని సోలార్ ఎనర్జీగా ఉపయోగించే అవకాశం ఉంటుంది.

ప్రదర్శించింది : రోహిత్ శర్మ, నిట్ వరంగల్

గురి చూసి కొట్టు.. టార్గెట్ చేరుకో...



స్పాట్ లైట్స్ ఈవెంట్‌లో భాగంగా ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టార్గెట్‌ను బాల్‌తో చేరుకునేందుకు పింగ్‌పాంగ్ లాంఛర్‌ను ఏర్పాటు చేశారు. రోబో కారు వీల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పీడ్ సెన్సార్‌లో బాల్‌ను పెట్టగా స్పీడ్ కంట్రోల్‌తో టార్గెట్‌ను చేరుకుంటుంది.

ప్రదర్శించింది : నిశ్చిత్, హైదరాబాద్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో శనివారం ముగ్గురు రైలు కింద పడి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


మురళి (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఓ వ్యాపారి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం రఘునాథపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జనగామ జీఆర్పీ అధికారుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన సిరికొండ మురళి (41) రఘునాథపల్లిలో గోల్డ్‌స్మిత్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు సరిగా నడకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో దంపతుల మధ్య కలహాలు చోటుచేసుకున్నాయి. మనస్తాపం చెందిన మురళి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని జనగామ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

వరంగల్‌లో వ్యక్తి ..


సరేష్ (ఫైల్)

కాశిబుగ్గ : అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వ్యక్తి రైలు కింద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య మెడికేర్ ఆసుపత్రి సమీపంలో జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిడుగు గ్రామానికి చెందిన శ్రీరాముల నరేష్(45) నగరంలోని కరీమాబాద్ బీఆర్‌నగర్‌లో ఉంటూ తన సోదరుడి సెలూన్ షాపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా బీపీ, షుగరు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఈ సమస్యలు తాళలేక ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడి శనివారం సాయంత్రం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా రైల్వే హెడ్ కానిస్టేబల్ రాజు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారని సీఐ నరేష్ తెలిపారు.

జనగామలో మహిళ..


లక్ష్మి మృతదేహం

జనగామ: జనగామ పట్టణం బీరప్పగడ్డకు చెందిన కూరాకుల లక్ష్మి(42) శనివారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన లక్ష్మి.. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై జీఆర్పీ సిబ్బంది కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


రక్షిత్ మృతదేహం

కొత్తగూడ: ఆడుకుంటూ వెళ్లి నీటిసంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని వేలుబెల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొంపెల్లి యాకయ్య–అనిత దంపతులకు కుమారుడు రక్షిత్(3) ఉన్నాడు. తల్లిదండ్రులు పనిలో ఉండగా బాల్‌తో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో బాల్ ఇంటి బయట ఉన్న నీటి సంపులో పడింది. బాల్ కోసం రక్షిత్ వెళ్లి అదే సంపులో పడ్డాడు. ఈ ఘటనను ఎవరూ గమనించలేదు. పనులు ముగించుకుని తల్లిదండ్రులు రక్షిత్ కోసం వెతకగా నీటిసంపులో తేలి ఉన్నాడు. బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిపై మండలంలోని ఫత్తేపురం గ్రామ స్టేజీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చెర్లపాలెం గ్రామానికి చెందిన అనుమాండ్ల వాసురెడ్డి(56) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి

- కేయూలో ఫార్మసీ విద్యార్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఫార్మసీ కళాశాలల విద్యార్థులు కేయూ పరిపాలన భవనం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్ మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నియమాల ప్రకారం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ధర్నా చేస్తున్న విద్యార్థుల వద్దకు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్, డీన్ గాదె సమ్మయ్య, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ కృష్ణవేణి వచ్చి మాట్లాడారు. అనంతరం రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు చాంబర్‌లో పరీక్షల విభాగం అధికారులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, బీవోఎస్ చైర్‌పర్సన్, ఫార్మసీ కళాశాల డీన్‌తో సమావేశమై చర్చించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ అకడమిక్ పరంగా డీన్, బీఓఎస్, ప్రిన్సిపాల్ స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదన పంపాలని సూచించారు. అనంతరం రిజిస్ట్రార్ సూచన మేరకు ప్రిన్సిపాల్ ప్రసాద్, సమ్మయ్య, బీఓఎస్ కృష్ణవేణి.. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లారు. అక్కడ డీన్ సమ్మయ్య మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకపోవడంతో ఎక్కువ మంది విద్యార్థులు డిటైన్డ్ అయ్యారని, దీంతో ఈ ఒక్కసారికి డిటెన్షన్ విధానం ఎత్తివేసేందుకు తాము స్టాండింగ్ కమిటీకి త్వరలో ప్రతిపాదిస్తామన్నారు. విద్యార్థులు ఆందోళన విరమించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఎస్ఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తురు సాయికుమార్, ఏబీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్‌కళ్యాణ్, ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదిస్తే స్టాండింగ్ కమిటీలో చర్చిస్తాం

ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు డిటెన్షన్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలంటే కళాశాల ప్రిన్సిపాల్, డీన్, బీఓఎస్‌ల నుంచి అకడమిక్ సెనేట్‌కు ప్రతిపాదిస్తే స్టాండింగ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ప్రయత్నిస్తాం. సెమిస్టర్ సిస్టమ్‌లో పరీక్షలు ఉన్న నేపథ్యంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలంటే కొంత సమయం పడుతుంది.

- ఆచార్య మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి

బీజేపీ మతరాజకీయాలను తిప్పికొట్టాలి

- ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్


మాట్లాడుతున్న వెంకటేశ్

న్యూశాయంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతరాజకీయాలను తిప్పకొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేశ్ అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్ సుందరయ్యభవన్‌లో సీఐటీయూ, వ్యవసాయ, కార్మిక రైతుసంఘాల జిల్లా సదస్సు సారంపల్లి వాసుదేవరెడ్డి, టి.ఉప్పలయ్య, శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతూ అయోధ్య రామమందిరాన్ని ముందుకు తెచ్చారన్నారు. దేశంలోని కార్మికవర్గం, రైతాంగం, ప్రజలందరిని చైతన్యం చేయడం కోసం ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బంద్‌లో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాగుల రమేశ్, జి.రాములు, ఎం.చుక్కయ్య, గాదె ప్రభాకర్‌రెడ్డి, రవి, చక్రపాణి, వెంకట్, లింగయ్య, సారంగపాణి, అశోక్, రాఘవులు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ మంత్రిని కలిసిన కార్మికులు

ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హనుమకొండకు వచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రంగం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి బి.సంపత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు రమేశ్, సుధాకర్, దేవేందర్, ప్రభాకర్ ఉన్నారు.